
# పాపం అరుణ

ఎస్. బాలాజీ




**రాత్రివేళ శోభనపు గదిలో పందిరి మంచం పలురకాల పుష్పాలతో అందంగా అలంకరించబడి వుంది. జాజిపూలు, బొండు మల్లెలు మంచం మీద ఒత్తుగా పరచబడి వున్నాయి.**

అగరువత్తుల సువాసన గుభాళిస్తోంది గదంతా. పువ్వుల పరిమళం పరవశింపజేస్తోంది. కొత్త పెళ్ళికూతురు సరిత చక్కగా అలంకరించబడి పొందికగా మంచం మీద కూర్చోనుంది. ఆమె దృష్టి అంతా, మూసిన గుమ్మం తలుపు మీదే వుంది. కాసేపటికి, తలుపు తెరిచిన చప్పుడైతే లేచి నుంచుంది కంగారుగా. సత్యం లోపలికొచ్చి, తలుపు గడియ పెట్టాడు. తెల్లటి లాల్చి, పంచెకట్టుతో హుందాగా వున్నాడు. మెల్లగా వచ్చి, మంచం ప్రక్కన వున్న కుర్చీని లాగి సిగ్గుతో తలొంచుకొని నిల్చున్న సరితను రెండు చేతులతో మృదువుగా స్పృశించి తీసుకువచ్చి కుర్చీలో కూర్చోబెట్టి మరో కుర్చీలో తను కూర్చున్నాడు. ఆమె లేచి అతని పాదాలకు మొక్కబోయింది. అతను అడ్డుకొని "చూడు సరితా! ఇలాంటివన్నీ పాతకాలానికే పరిమితం. ఇలాంటి వన్నీ నాకిష్టముండదు. నీతో చాలా చెప్పాలి. అలా కూర్చో" అన్నాడు. చేరువలో ఉన్న వెండి పాలగ్లాసుని, అతనికి అందించింది. సగం తాగి, మిగతాది ఆమె నోటికందించాడు చిరునవ్వుతో సత్యం. ఆమె తృప్తిగా తాగింది. ఆమెలో ఇదివరకున్న బిడియం, కంగారు లేదిప్పుడు. అతడు చెప్పబోయే విషయాన్ని ఆలకించడానికి సిద్ధంగా వుంది. మొదట్లో కాస్త తటపటాయించాడతడు. ఎలా మొదలు పెట్టాలా అని. తర్వాత మెల్లగా చెప్ప సాగాడు.

"సరితా! నేను చెప్పబోయే విషయం చాలా అసహజమైనదని నాకూ తెలుసు. ప్రతి ఆడపిల్ల హర్షించదగ్గది కాదు కూడా. అయినా చెప్పక తప్పదు" అని ఆగాడు. కొన్ని క్షణాలు మౌనం

రాజ్యమేలింది ఆ గదిలో. సరిత అంత రంగంలో, వినరానిదేదో వినవలసి వస్తుందే మోనని, కొంత భయం కలిగింది. తర్వాత అందుకున్నాడతడు. "నాకు పువ్వులంటే అలెర్జీ. వాటిని ముట్టుకోటానికి కూడా మనస్కరిం చదు. అదీ, నా పదహారవ ఏటనుంచే. అం తకు మునుపు అందరికి మల్లే నాకూ పువ్వు లంటే తగని మక్కువ. మల్లెపూవంటే మరీ ఇష్టం. నా పదహారవ యేట జరిగిన ఓ విషాద సంఘటన కారణంగా వాటిపై విరక్తి కలిగింది.

అని నేను హైస్కూల్లో ఏడవ తరగతి చదువుకుంటున్న రోజులు. మా గ్రామానికి హైస్కూలున్న టౌనుకి మూడు మైళ్ళు. మధ్యలో రైలు వంతెన. మా ఊరికి పడమటి దిక్కున, పదిమైళ్ళ దూరంలో ఎత్తైన కొండలు, వాటి మీద పడ్డ వర్షపు నీళ్ళు, వంతెన ద్వారా పారుతూవుండేది. నేను నా తోటి పిల్లలతో, స్కూల్‌కి వెళ్ళేటప్పుడు, తిరిగి వచ్చేటప్పుడు పావుగంట ఆ వంతెన మీద కూర్చొని సెల యేటి అందాల్ని, వెళ్తోన్న రైళ్ళను ఆసక్తిగా చూసేవాళ్ళం. అటూ యిటూ కొలువుదీరి నట్లున్న, పచ్చని చెట్లు, తలలువంచి మెల్లగా వూగుతూ మాకు సేద తీర్చేవి.

ఒకనాటి సాయంకాలం, బడి వదిలాక, నేను యింటికి వెళ్తుండగా బడికి కాస్త దూరంలో, ఎవరో యిద్దరు ఆకతాయి కుర్రాళ్ళు ఓ అబ్బాయిని ఆటపట్టిస్తూ వున్నారు. వాళ్ళు కూడా మా బడిపిల్లలే. వాళ్ళు యిద్దరు. ఇతనొక్కడు. బెదిరిపోతున్నాడు. తీరు చూస్తే కలవారింటబ్బాయి లాగున్నాడు. ఇతను భయపడేకొద్దీ, వాళ్ళు రెచ్చిపోతున్నారు. అందరూ యించుమించు నా ఈడు వాళ్ళే. అతని నిస్సహాయ స్థితిని చూసి నాకు జాలే సింది. విచారించగా, అబ్బాయి ఖరీదైన కలం లాక్కుని ఇవ్వనంటున్నారు వాళ్ళు. ఆ కలం అతడి అక్కదట. కాసేపైతే ఏడ్చేసేలాగున్నాడు. నేను మంచిగా అతని కలాన్ని, అతనికిచ్చేయ మన్నాను. వాళ్ళు ఇవ్వకపోగా, దురుసుగా నా మీదకొచ్చి, నా చొక్కా పట్టుకొని 'మేమివ్వం, ఏం చేస్తావ్' నిర్లక్ష్యంగా అన్నాడొకడు. నాకు తిక్కరేగింది. చేతిలో వున్న టిఫిన్ కారియర్, పుస్తకాల సంచిని క్రిందపడేసి, చొక్కా పట్టు కున్నవాణ్ణి లాగి ఒక్కటిచ్చాను బలంగా. దాంతో దిమ్మతిరిగి క్రిందపడ్డాడు. రెండోవాడు



హైదరాబాద్‌లో ఇటీవల త్యాగరాయ సభా సదనంలో రచయిత్రి రత్నా మహీధర్‌కు సన్మానం జరిగింది. రాగఝరి సంస్థ పక్షాన జరిగిన ఈ కార్యక్రమంలో ఐ.జి. ఆఫ్ పోలీస్ గోపీనాథరెడ్డిగారు రత్నామహీధర్‌కు జ్ఞాపికనిస్తున్న దృశ్యం. చిత్రంలో శరత్ జోత్స్నారాణి, విజయలక్ష్మిగారు ఉన్నారు.

రాయి తీసుకొని నా మీదకు రాబోయాడు. నేనతని చేతిని, లాఘవంగా ఒడిసిపట్టుకొని, క్రిందపడేసి రొమ్ము మీద కూర్చుని ముఖం మీద ఒక్కటిచ్చాను. నా ఆవేశం చూసి భయపడిపోయి దణ్ణం పెట్టేశాడు. ఈ లోగా మొదటివాడు లేచి దౌడుతీశాడు. నేను పైకి లేచి, క్రిందపడ్డవాణ్ణి, చేయి ఆసరా యిచ్చి పైకి లేపాను. వాడు జేబులోనుంచి కలాన్ని తీసి, ఇతనికిచ్చి, సారీ చెప్పి వెళ్ళాడు. ఆ పెనుగులాటలో నా చొక్కా చిరిగింది. అతని సంతోషానికి మేరలేకపోయింది. నా చేతులు రెండూ పట్టుకొని "చాలా థాంక్స్" అన్నాడు. మేం ఒకరికొకర్ని పరిచయం చేసుకున్నాం. అతని పేరు మధు. ఆరవ తరగతిలో కొత్తగా చేరాడు. నన్ను వాళ్ళింటికి రమ్మని కోరాడు. ఇవాళ కాదులే మధూ ప్రొద్దుపోతోంది, మరెప్పుడైనా వస్తాను" అని నా స్నేహితులతో కలిసి, మా ఊరికి బయలుదేరాను.

మధు నేను స్నేహితులమయ్యాం. ఆ రోజు శనివారం. బడి మధ్యాహ్నం వరకే. అతని కిచ్చిన మాట ప్రకారం, వాళ్ళింటికెళ్ళాను, మధుతో కలసి నన్ను, తన అమ్మకీ, అక్కకీ పరిచయం చేశాడు. వాళ్ళు నన్ను ఆప్యా యంగా దగ్గరకు తీసుకొని, ఆనాటి నా ఘనకార్యానికి మెచ్చుకున్నారు. నా వివరాలడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం భోజనం, సాయంత్రం ఫలహారం అయ్యాకగాని నన్ను విడిచి పెట్టలేదు. నేను తిరిగి వచ్చేటప్పుడు ఓ అట్టపెట్టె నా చేతికిచ్చి వీలైనపుడల్లా వచ్చి మధుతో కలిసి ఆడుకోవలసిందిగా కోరారు. ఇంటికొచ్చి చూస్తే, అట్టపెట్టెలో నాకు సరిపోయే, కొత్త చొక్కా, లాగువున్నాయి. మధు నన్ను విడిచి వుండలేని పరిస్థితికొచ్చాడు. ఇంచుమించు నా పరిస్థితీ అదే. మధు తల్లి అన్నపూర్ణమ్మగారు, అక్క అరుణగారు, మధుతో సమానంగా ఆదరించారు నన్ను. ముఖ్యంగా అరుణక్క, నాపై చూపిన అభిమానాన్ని ఎన్న టికీ మరువలేనిది. ఎంతో చనువుగా, ఆప్యా యంగా వుండేది నాతో. నాతోడ పుట్టిన వాళ్ళ లోగాని, నాకు తెలిసిన బంధువర్గంలోగాని, అక్కలు ఎవరూ లేరు నాకు. చెల్లెళ్ళు మాత్రమే వున్నారు. అక్క ప్రేమంటే ఏమిటో ఆమె దగ్గరే చవిచూశాను. ఆమె చామనఛాయ. అయినా కళగల ముఖం. ఎప్పుడూ ప్రసన్నంగా, చిరు నవ్వుతో, మృదువుగా ఉండేది. ఆమె సింగ పూరులో జన్మించినా, కాన్వెంటు చదువులు చదివినా, ఆధునిక పోకడలు లేకపోగా, కట్టూ బొట్టూ విషయంలో, సంప్రదాయాన్ని పాటిస్తూ, ఒంటినిండా పసుపు రాసుకొని, తలనిండా మల్లెపూలు పెట్టుకొని, కళకళలాడుతూ

వుండేది. మధుకి మూడేళ్ళప్పుడు, సింగపూర్‌లో ఇంజనీరుగా పనిచేస్తున్న, వాళ్ళ నాన్నగారు ప్రమాదవశాత్తు మరణించగా, అన్నపూర్ణమ్మగారు అన్నీ తానై పిల్లల్ని సాకింది. విధిగా ఉదయం పూట ఒక గంటసేపు పూజ చేస్తారు ముగ్గురూ. పిల్లల్ని మంచి కట్టుబాట్లతో పెంచిందామె.


అరుణక్కకు, తన మేనత్త కొడుకుతో అతను ఇంజనీరింగు చదివేటప్పుడు ఢిల్లీలో వివాహం చేశారు. చదువు పూర్తయిన వెంటనే, అక్కడే ఉద్యోగం దొరికింది. ఉద్యోగంలో చేరిన ఏడాదికే అతను ఓ అబ్బాయికి తండ్రి అయ్యాడు. కూతుర్ని వదలి వుండలేక, మనవడిని, కూతుర్ని తన దగ్గర వుంచుకొంది అన్నపూర్ణమ్మగారు. మధు పదికి, నేను 11వ తరగతికి వచ్చాం. రోజులు హాయిగా గడుస్తున్నాయి. చిన్నపిల్లాడికి మూడవ ఏడు వచ్చింది. ఒకరోజు అశనిపాతంలా టెలిగ్రాం వచ్చింది. అందులో అరుణక్క భర్తకి సీరియస్‌గా వుందని, వెంటనే రమ్మని వుంది. ఎంతో ఆనందంగా, సందడిగా ఉన్న ఆ కుటుంబంలో విషాదం అలుముకుంది. హడావిడిగా ముగ్గురూ బయలుదేరి వెళ్లారు ఢిల్లీకి. నా మనస్సదోలా అయిపోయింది. ఆ అంకుల్‌ని కాపాడమని దైవాన్ని వేడుకున్నాను మనసులో. నాలుగు రోజుల తర్వాత పిడుగులాంటి వార్తను మోసుకొచ్చింది టెలిగ్రాం. మధు బావగారు పోయారని, దహన సంస్కారాలు అక్కడే పూర్తి చేసి, ఆ రాత్రి ట్రైన్‌కు మద్రాసు వెళ్తున్నామని. అచేతనంగా వుండిపోయాను కొన్ని క్షణాలు. మనస్సంతా వికలమైపోయింది. ఎప్పుడూ తలనిండా పూలతో, పసుపు పారాణితో, కళకళలాడుతూ పచ్చగా వుండే, నేను ఎంతగానో అభిమానించే అరుణక్కకు, పసిప్రాయంలోనే, వైధవ్యం ప్రాప్తించడం నేను జీర్ణించుకోలేక పోయాను. ఆ క్షణం నుండి దేవునిపై కోపం. నాకే తెలియని విరక్తి భావం నాలో ఏర్పడింది.

నేను, మా నాన్న, మధు కుటుంబ పరిచయస్తులు కొంతమంది రైల్వేస్టేషన్ చేరుకున్నాం. ట్రయిన్ పావుగంటలో చేరుకుంటుందని అనౌన్స్ చేశారు. మా హృదయాలలాగే భారంగా వచ్చి ఆగింది రైలు. మధు పెట్టెలో నుండి దిగి నా వద్దకు వచ్చాడు. ఉబికి వస్తున్న ఏడుపుని బలవంతాన ఆపుకున్నామిద్దరూ. అపెండిసైటిస్ ముదిరిపోవడం వల్ల బావగారిని కాపాడుకోలేక పోయామన్నాడు గద్గదస్వరంతో. ఇంతలో అరుణక్క కంపార్ట్‌మెంట్ ద్వారం వద్దకు వచ్చి తలొంచుకుని నుంచుంది మౌనంగా కాసేపు. మూర్తీభవించిన శోక దేవతలావుంది ముఖం. కళ్ళు వాచి వున్నాయి. నేను చెంతకు వెళ్ళి బావురుమన్నాను. నిశ్శబ్దంగా ఆమె నా తల నిమిరింది. తర్వాత లోపలి కెళ్ళిపోయింది.

బావగారికి కర్మకాండ పూర్తయ్యాక తను వచ్చి యింటి సామాన్లు మద్రాసుకు తీసుకెళతానని చెప్పాడు మధు. పావుగంట తర్వాత రైలు కదిలింది. స్టేషన్లో అరుణక్కను చూసి, ఆమె ఏమాత్రం విలపించక మౌనంగా వుండిపోయినందుకు వింతగా వున్నదని మానాన్న వ్యాఖ్యానం. నాకది విడ్డూరంగా తోచింది. కోపం కూడా వచ్చింది. ఆయన చెంత ఉండటం మనస్కరించక యువతలకు వచ్చేశాను. ఆత్మాభిమానం, వ్యక్తిత్వం, సభ్యత, సంస్కారం గల కొద్దిమంది స్త్రీలు, సగటు స్త్రీలకు భిన్నంగా వ్యవహరిస్తుంటారు. శ్రీమతి జాక్విలన్ కెన్నడీగారన్నట్లు "నీ గుండెల్లో మండే బాధ నీ వ్యక్తిగతం. దాన్ని లోకానికి చూపకు. బాధని భరించలేనప్పుడు చాటుగా వచ్చి యేడ్వు. అంతేగాని పదుగురిలో విలపించి ఇబ్బంది పెట్టకు" అన్న సూక్తిని పాటించిందామె. రైల్వే స్టేషన్‌లో ఆ కంపార్ట్‌మెంట్ వద్ద నిల్చున్న కొన్ని క్షణాలు, తన కన్నీటిని బయటకు రాకుండా ఆపడానికి ఆమె ఎంత నరకయాతన పడిందో ఈయనకెలా తెలుస్తుంది. ఆ క్షణం నుండి పూలను చూస్తే, విషాదంతో చిన్నబోయిన అరుణక్క ముఖం గుర్తుకొస్తుంది నాకు. ఆ వెంటనే వాటిపై విరక్తి కలుగుతుంది. అది నానాటికి తీవ్రమై పూలంటేనే అలెర్జీ ఏర్పడింది నాకు." అని ముగించాడు సత్యం.

అంతా విన్న తరువాత సరిత గాఢంగా నిట్టూర్చి 'ఇప్పుడే వస్తానండీ' అని లేచి వెళ్ళింది. పది నిమిషాల తర్వాత దిండు గలీబులు, బెడ్‌షీటు తీసుకొచ్చి పందిరి మంచం ప్రక్కన నేల మీద పరిచింది. ఇప్పుడామె ఒంటిమీద నగలు కాని, తలలో పూలుగాని లేవు. కేవలం మల్లెమొగ్గనొకదానిని తలలో కనబడకుండా తురుముకుంది. చిరునవ్వుతో వచ్చి ఎదురుగా నుంచుంది. ఊహించని ఆమెలోని మార్పుని చూసి మొదట ఆశ్చర్యమేసినా, వెంటనే తేరుకుని 'నేను చాలా అదృష్టవంతుణ్ణి సుమా' అని ఆమెను ఆర్తిగా దగ్గరకు తీసుకున్నాడు సత్యం. ❀

## మల్టీ డిటెక్టర్ సిటీ స్కాన్



**గుం**డె జబ్బు వారికి ఒక శుభవార్త. ఈ మధ్యనే అమెరికాలో ఒక కొత్తరకం స్కాన్ కనిపెట్టారు. ఈ స్కాన్ అందరూ తీసుకొనే ఆంజియోగ్రాము అవసరం లేకుండా చేస్తుందట. ఎంతో తక్కువ ఖర్చుతో శ్రమ లేకుండా కొద్ది సెకండ్లలోనే ఈ స్కాన్ రక్తనాళాలలోని బ్లాకులు, చాలా క్లియర్‌గా బొమ్మ తీసి చూపిస్తుందట. రోగి నిముషాలలో తేరుకొనటమే కాక వైద్యుని చేతిలోకి అతని గుండె పరిస్థితి తెలిపే బొమ్మ కూడా వస్తుంది అంత త్వరగా. ఆంజియోగ్రాము తీయటానికి కొన్ని గంటలు పట్టటమేకాక రోగి ఆస్పత్రిలో ఒక రోజైనా ఉండాల్సి వస్తుంది. ఈ ప్రయోజనాల మూలాన అమెరికాలో ఈ కొత్త స్కాన్ అప్పుడే దేశవ్యాప్తి చెందటంలో ఆశ్చర్యం లేదు. కానీ ఈ కొత్త స్కాన్ సమర్థతని ప్రశ్నించే వైద్యులు లేకపోలేదు. అయితే ఈ స్కాన్ చూపే సులభ మార్గం వలన కొందరు వైద్యులు దీనిని అతి విరివిగా ఉపయోగించి అనవసరమైన శస్త్రచికిత్సలకు రోగులను గురిచేసే అపాయమున్నదని. ఎక్కువ మంది వైద్యులు దీని మీద మక్కువ చూపటంతో ఈ స్కాన్ త్వరలో ప్రపంచ వ్యాప్తి చెందుతుంది అని ఆశించటంలో అతియోక్తి లేదు.

**- వి.కె. మోహన్**